స్కెచ్

# గేహే గేహే

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

ఉన్నట్టుండి సుదర్శనం తలకాయలోకి ఒక్కో ఆలోచన వొస్తూంటుంది. ఇంక చూడండి— దాని అమీతుమీ తేలేదాకా అతను నిద్రపోడు. అంత కార్యశూరుడు సుదర్శనం.

అయితే, సుదర్శనానికి తరుచూ ఆలోచనలు రావు. అదో గొప్ప అదృష్టమో, దురదృష్టమో, భావి చరిత్రకారులకి తెలియాలిగాని, ఇప్పుడు చెప్పలేం. సామాన్య మానవుడు చరిత్రలోకి వొస్తాడా అనేది నెహ్రూలాటివాళ్ళూ, సుదర్శనంలాంటి వాళ్ళూ ఆలోచించాల్సినది.

"ఈ వొంకాయ లెలాఇస్తావూ?" అన్నాడు సుదర్శనం బజారులో కూరలు కొనబోతూ.

"వీశ పదిఅణాలు" అన్నాడు వ్యాపారి.

"పదణాలే!" ఆశ్చర్యపోయాడు సుదర్శనం.

"అవునండి" జవాబిచ్చాడు వ్యాపారి.

"అవున్లే" అనుకుంటూ, ఆలోచనల్లోకి జారి పోయాడు సుదర్శనం. సినీమావాళ్ళయితే, కూర గాయల మార్కెట్ముందు, ఒక వంకాయని చేత్తో త్రిప్పుతూన్న సుదర్శనాన్ని ఒక క్లోజప్ ఇచ్చి, సీను డిజాల్వ్ చేసి...

అవును. అర్థశాస్త్రం వొచ్చినా రాకపో యినా, సరకులకి డిమాండు అట్లానేఉండి, సప్లయి పడిపోయినా, డిమాండు హెచ్చిపోయి పడిపో యినా ఖరీదులు హెచ్చవుతాయి. ఈ వంకాయ లకి డిమాండు హెచ్చయింది; సప్లై పడిపో యింది—

ఎంచేతా? అదే కారణం. యుద్ధాలు ప్రపం చంనిండా యుద్ధాలు. ఇండోచైనాలో తన్ను కుంటున్నారు. ఫ్రెంచివాళ్ళకి ఏ క్షణంలోనైనా అమెరికావాళ్ళు సాయంరావొచ్చు. ఆ క్షణంలో చైనావొచ్చి వీట్మిన్తో కలుస్తుంది. ఆ మరు క్షణంలో రష్యా కోటిచేతుల్తో చైనా ప్రియు రాలిని కవుగలించుకుంటుంది. దాంతో యుద్ధం ప్రపంచవ్యాప్తంగా, ప్రమాదకరంగా, ప్రకటితం అవుతుంది. (సుదర్శనం కావ్యాలు చదివాడు-) అమెరికా అప్పుడు ఆటంబాంబు (అయ్యో! ఇంకా తరతరాలు వెనుకేవున్న సామాన్యుడా!) ప్రయోగిస్తుంది. రష్యాకి కోపంవొచ్చేస్తుంది—

ఫలితాలని ఊహించుకోలేక పోయ్యాడు సుదర్శనం. ఆటంబాంబు! జేబులో పెట్టుకో వొచ్చుట. వంకాయలాగ వుంటుంది కామోసు.

"బాబోయ్!" అనుకుని క్రిందని పడేశాడు వంకాయని సుదర్శనం. ఒక్కసారి తనచెయ్యి కాలినట్లయింది. అలాటి మారణాయుధాన్ని తాను ముట్టుకుని పట్టుకోవడమే!—ఈ అమె రికా సామ్రాజ్యవాదుల దుశ్చర్యలని....

"అర్థరూపాయికి ఇస్తాను—తీసుకోండి"

సినీ కెమరా అయితే, సుదర్శనం పద్దతృళ్ళి పాటుని చక్కగా రికార్డుచేసి ఉండేది.

"నా కసలు వంకాయలే వొద్దోయ్—"

కొంచెం తోటకూరా, కొంచెం గోంగూర కొనుక్కుని సంచీలో వేసుకుని ఇంటికి బయలు దేరేడు సుదర్శనం. ఆకుకూరలు అన్నివిధాలా మంచివేగాని, అమెరికా అయిసెన్ హోవరూ, (మెక్) ఆర్థరూ, ఆటం, ఇత్యాదుల్లా అవీ, 'అ ఆ' లతో ప్రారంభిస్తాయి. అంచేత అవి విన గూడదని ఎవరో ఓసారి అన్నాక, సుదర్శనానికి ఆ ఉద్దేశం చాలా నచ్చింది. మామిడికాయలూ, మాగాయా, మొ॥ మాలటోవ్, మాలంకోవ్, మానవ స్వాతంత్ర్యం మొదలగు వాటిలాగ 'మా' తో ప్రారంభిస్తాయి కనక, వాటిని సేవించాలనికూడా ఆ ఆసామీ చెప్పేడు.

"ఎనిమిది పేజీలు ఒక అణా!"

అరుస్తూ తెలుగు దినపత్రిక అమ్ముతున్నాడు. జేబులో డబ్బులు మిగిలినప్పుడల్లా పత్రిక కొంటూ ఉంటాడు సుదర్శనం. వాటిలోకూడా, "ఆ"తో ప్రారంభించిన పత్రిక కొందా మనుకుంటాడు సుదర్శనం. కాని అలాటిపత్రికలుకొంటే ప్రమాదం

అని తేజోమూర్తి ఓసారి తనతో అన్నాడు. అందుకని, ఓ అణా ఇచ్చి ఓ పత్రిక కొని ఒక చేత్తో పట్టుకుని (ప్రకటనా పద్ధతులూ, వాటి వలన లాభాలూ సుదర్శనానికి కొంతవరకు తెలుసు) ఇంటికెళ్ళాడు.

కూరలసంచీ గదిలో పడేసి వెళ్ళి తన కుర్చీలో కూర్చుని పత్రిక విప్పాడు సుదర్శనం.

"మహా శక్తివంతమైన మారణాయుధం."

హైడ్రోజన్ బాంబు పరీక్ష: బికినీ.

"మానవులూ, శాస్త్రజ్ఞులూ కనీవినీ ఎరుగని దుష్ఫలితాలు—"

అటంబాంబులంతంత అక్షరాలతో, తారు కన్న నల్లగా, త్రీ-డీ పిక్చర్‌లాగ ముందుకి తోసుకొస్తున్న ఈ అక్షరాలు ఒక్కసారి సుదర్శనం తలకాయలోకి దూరిపోయాయి. కొద్దిక్షణాలు అతనికి ఏమీ తోచలేదు. నిజం? అనుకున్నంతా అయిందీ? కనిపెట్టేశారూ? ఇంతగొప్ప...

కొంచెం ప్రయత్నించి, మిగిలిన విషయాలన్నీ చదివాడు సుదర్శనం. ఆ బాంబువల్ల కలిగిన చెడుఫలితాలన్నీ చదువుతూంటే, సుదర్శనానికి భూమి అంతం అయే నిముషం చాలా దగ్గిరికి వొచ్చేసిందనీ, ఆ శ్రీమన్నారాయణుడు సృష్టిని పరిసమాప్తిచెయ్యబోతున్నాడనీ అనిపించింది.

గుక్క విడవకుండా పత్రిక అంతా చదివేశాడు సుదర్శనం. యావత్ప్రపంచమూ - ఇంగ్లండు, ఫ్రాన్సు, గాటిమాలా, టింబక్టూ, ఇండియా - అన్ని దేశాలు, "వొద్దు-ఇంక ఈ మహాయుధంతో పరీక్షలు సాగించవద్దు" అని మొరపెడుతున్నాయి. ఈ పత్రిక సంపాదకీయం నిండా ఆ ఆత్రుత తొణికిసలాడుతూ ఉంది.

చెమటపోసేసింది సుదర్శనానికి. ఈ బాంబుతో ఇంక భూప్రపంచం అంతం అయిపోతుందనీ, అది కేవలం కాలక్రమంలో మాత్రం ఉందనీ అతనికి తెలిసిపోయింది. ఈ సామ్రాజ్యవాదులు ఈ బాంబుని కనిపెట్టి ప్రపంచాన్నంతటినీ నాశనముచేసేసి ఏం బావుకుంటారూ?

ఒకసారి తన ఇంటిచుట్టూ చూసుకున్నాడు సుదర్శనం. ఇండియామీద అమెరికాకి మహా కోపంగా ఉంది. నెహ్రూకి మాత్రం అంతనోటి బిరుసేమిటీ? ఏదో పాకిస్తానం, అమెరికాలు పరస్పరం సహాయం చేసుకుంటే మనకేం? పోనీ, కాశ్మీరమే కదా తీసుకుంటారు. దాని కోసమని దేశాన్నంతటినీ ఈ మహాబాంబులకి ఆహుతి చేస్తారా?

ఇండియాకి ఓడజను బాంబులు పంపి తీరుతారు. ఓనాడు ఈయిల్లూ, ఈచుట్టూ మొక్కలూ, అన్నీ నాశనం అవుతాయి. ఇల్లు అద్దెది కనక తనకి బాధలేదు. కాని, ఆ దొండపాదూ, ఆ నిత్యమల్లి మొక్కా ఏమవుతాయీ? మూడు వేలుపోసి ఆ పార్కు కట్టించారు మునిసిపాలిటీ వాళ్ళు-అది నాశనం అయిపోతుందా?

ఆ మరుక్షణం శ్రీకృష్ణపరమాత్మ చెప్పిన,

"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే!"

అన్న గీతావాక్యం జ్ఞాపకంవొచ్చి కలవరపడ్డాడు సుదర్శనం. ఆ వాక్యం అబద్ధం అవుతుందా?

అవ్వే-శ్రీకృష్ణభగవానుడు గాంధీగా అవతరించే, పుణ్యాత్ములని తరింపజేసి వెళ్ళిపోయాడు. అవతారపురుషు లందరూ హత్యచేయబడ్డారు. అంతా అయిపోయింది. ఈ శిష్టరక్షణ అయ్యాక దుష్టశిక్షణకోసం ఈ బాంబు.

* * *

"ఏం సుదర్శనం, పెర్సనల్ రిజిస్టరు అప్‌టుడేట్ చేశావా?"

"కాదండి...సాయంత్రానికి..."

"నీ వర్కు మరీ అన్యాయంగా ఉంది! క్రిందటి ఇన్స్పెక్షనుకే నువ్వు చాలా పూర్‌గా పని చేసేవు...ఇలా అయితే—"

ఇంక వినపడలేదు. హెడ్‌క్లర్కుకి తానంటే ఎప్పుడూ కోపమే. ఛీ ఎప్పుడూ చీవాట్లే ఛస్తే మేలు.

ఉండుండి అడిగి, కొంచెం ఎరియర్స్ ఉంటే, ఇంత రాద్ధాంతం. ఇంతా అయితే పదేళ్ళక్రితం అతనూ తనలాగే ఎల్. డీ. సీయే.

ఆ రోజంతా అలాగే ఉంది సుదర్శనానికి. త్వరలో ప్రపంచం ఎలాగూ అంతం అయిపోతూనే ఉంది. ఈ రవంతకాలంలో, ఎందుకీ మిడిసిపాటు?

ఓక్షణం, ఆ బాంబు తన ఆఫీసుమీదపడి, ఆ రికార్డూ (తన కాగితాలు, ముఖ్యంగా) ఈ హెడ్‌క్లర్కూ, రామస్వామీ (అతనికి తాను డబ్బివ్వాలి) చచ్చిపోతే బాగుండు ననిపించింది.

ఎలాగో ఆ రోజు ఆఫీసుపని ముగించుకుని ఇంటికి బయలుదేరేడు సుదర్శనం. వెళ్ళేసరికి ఇల్లాలు మహా కోపంగా ఉంది.

"ఆ కూర లెవరికోసం?" అంది.

"మనకే" నన్నాడు జంకుతూ సుదర్శనం.

"అవి పశువులు మాత్రం తింటాయి" అని ఉపోద్ఘాతం ప్రారంభించి నాలుగు పన్నాలూ వల్లించింది ఇల్లాలు.

ఆ చచ్చిపోయినవాళ్ళూ, ఈ పెళ్ళికాని మగాళ్ళూ, ఎంత అదృష్టవంతులో ననిపించింది సుదర్శనానికి. కర్మ కాకపోతే, మరుక్షణమే అప్పులవాళ్ళూ రావాలీ?

"డబ్బుతే" అంది ఇల్లాలు బయటికి బయలుదేరేడు సుదర్శనం. ఎవరిస్తారో ఎక్కడ కళ్ళాలో అతనికి తెలీలేదు. కాని, హైడ్రోజన్ బాంబు గురించిన అతని ఉద్దేశాలు మాత్రం కొంచెం మారాయి ప్రతీ ఇంట్లోనూ ఈ ఆయుధపరీక్షలు జరుగుతూనే ఉంటాయి. మానవులలో మగాళ్ళంతా ఈ బికినీలు. ఆ పరమాత్మ ఐసెన్‌హోవరు అనుకున్నాడు.

ఉన్నట్టుండి సుదర్శనం తలకాయిలోకి ఒక్క ఆలోచన వస్తూ ఉంటుంది. ఇంక చూడండీ— దాని అమాతుమీ తేలేదాకా అతను నిద్రపోడు. అంత కార్యశూరుడు సుదర్శనం పశ్చిమంగా (అమెరికావైపు) తిరిగి ఐసెన్‌హోవరుని స్మరించి చేతులు జోడించి, "సర్వశక్తిమంతుడా! నీ బాంబుని సాధ్యమైనంత త్వరలో ప్రయోగించి మమ్మల్ని తరింపజెయ్యి" అని ప్రార్థించాడు.

---

# వసంతగీత

అనురాగ జలధిలో మీనమవుతాను
ఆనంద పాథోధి లీనమవుతాను
సంతస వసంతవన
సంతతుల పరిమళము
లాను యెలదేటివలె
పారు సెలయేటివలె
ఈ ప్రేమవనములో పరుగు లిడతాను
ఈ కడలి యొడలిలో కరిగిపోతాను
సనజాజి కనుగీటి
కవ్వించు నన్ను
మల్లె మనసును విచ్చి
మాటాడు నాతో
తావినై ప్రేమైక జీవినై లోకైక
భావినై తీయగా పాట పాడిగిస్తాను
చివురులగు పూల వా
తెరక్రింది చెవులతో
ఆలకిస్తాను లో
కాల విన్పిస్తాను
ప్రతి వసంతమ్ములో పాడుకొంటాను
శ్రుతిమించి రాగాన సోలిపోతాను

—శశాంక.

Edited, Printed and Published by Khasa Subba Rau, at *Swatantra Printers*, 2. Brodies Road Mylapore Madras-4. Associate Editor: Gora Sastri.